క్లుప్తంగా

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



విశేష అలంకారంలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లి దర్శనానికి జాతర తర్వాత రెండవ ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు, గంధం, పసుపు, ప్రత్యేకంగా భక్తులు తెప్పించిన అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని అభిషేకాలు, పూజలు చేసి తమ మొక్కుబడులను, ముడుపులను అమ్మవారికి చెల్లించుకున్నారు. భక్తులు అమ్మవారికి మొక్కుబడులను తీర్చుకున్నారు. అనంతరం బంధు మిత్రులతో కలిసి విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆలయ సమీపంలోని వివిధ ఆలయాలలో భక్తులు పూజలు చేశారు.

క్రీడా స్ఫూర్తితో రాణించాలి



క్రీడాకారులతో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పులివెందల టౌన్ : పట్టణంలోని స్థానిక వైఎస్సార్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ ఫైనల్ మ్యాచ్‌ను ఆదివారం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ప్రారంభించి మాట్లాడారు. గెలుపు ఓటములను సమానంగా తీసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్‌రెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

బాలికల పట్ల పటిష్ట భద్రత కల్పించాలి

వేంపల్లె : పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థినుల పట్ల పోలీసులు, విద్యాశాఖ అధికారులు పటిష్ట భద్రత కల్పించాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కో ఆర్డినేటర్ రహంతుల్లా తెలిపారు. ఆదివారం వేంపల్లెలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం అవుతుండటంతో ఆకతాయిలు కూడా ఎక్కువ అవుతారన్నారు. విద్యార్థినులు పరీక్ష కేంద్రాలకు హాజరయ్యే సమయంలో మోటర్ బైకుల రైసింగ్, సైలెన్సర్ సౌండ్ పొల్యూషన్‌తో ఒక్కొక బైకులో నలుగురు ఎక్కి బాలికల పట్ల అకతాయి చేష్టలు చేసే అవకాశం ఉందన్నారు. ముందు జాగ్రత్త చర్యగా పరీక్షలు పూర్తి అయిన సమయంలో పోలీసులు నిఘా పెట్టాలని కోరారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : స్థానిక శ్రీకర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శశికాంత్‌రెడ్డి మేనకోడలు వనిత, కార్తీక్ రెడ్డిల వివాహం జరిగింది. ఈ వివాహానికి మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి పార్నపల్లి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిని సక్రమంగా విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ ఎరికలరెడ్డి

ఎర్రగుంట్ల : పట్టణంలో ఐసీఎల్ యజమాన్యం ప్రజల కోసం ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌కు కులాయిల నుంచి తాగునీటిని సక్రమంగా విడుదల చేయాలని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ ఎరికలరెడ్డి ఆదివారం ఖాళీ బిందెలతో ప్రజలతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసీఎల్ ఫ్యాక్టరీ ఏర్పాడినప్పటి నుంచి ఫ్యాక్టరీ ఎదురుగా రోడ్డుపైన కులాయిలు ఏర్పాటు చేసి ప్రజలకు నీటిని అందిస్తున్నారు. అయితే ఇటీవల కులాయిలకు సక్రమంగా నీటిని విడుదల చేయలేదన్నారు. దీంతో ఐసీఎల్ యజమాన్యం స్పందించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఔషధ గుణాల సిరి 'ఉసిరి'



విక్రయానికి సిద్ధంగా ఉన్న ఉసిరి కాయలు

పులివెందుల రూరల్ : ఉసిరిని ఔషధ గుణాల సిరి, ఆరోగ్య సిరి అని పిలుస్తారు. ప్రకృతిపరంగా సహజసిద్ధంగా లభించే వాటిలో ఉసిరి ఒకటి. ఇవి కూడా సీజన్ పరంగానే లభిస్తాయి. ఉసిరికాయలు బీపీ, షుగర్ తదితర దీర్ఘకాలిక వ్యాధులకు దివ్య ఔషధంలా పనిచేస్తాయి. సన్న నిమ్మ, చీని, మామిడి, సపోటా, సీతాఫలం తరహాలోనే ఉసిరి కూడా రైతుకు కొన్నేళ్లపాటు ఆదాయాన్ని అందిస్తాయి. ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్న ఉసిరి ప్రయోజనాలు తెలిస్తే ఆశ్చర్యపోతారు. ఉసిరి ముసలితనాన్ని నిరోధించడంలోనూ, శక్తివంతులుగా చేయడంలో దివ్య ఔషధంగా పనిచేస్తుంది. ప్రతి ఒక్కరూ ఒక రకమైన ఎలర్జీతో సతమతమవుతుంటారు. కాలుష్య ప్రభావంతో 30% ఏదో రకమైన ఎలర్జీతో బాధపడుతుంటారు. ఈ ఎలర్జీ అస్మా రూపంలో ఉంటుంది. ఎలర్జీ నుండి రక్షణ కల్పించడంలో ఉసిరికాయ ఎంతో దోహదపడుతుంది. ఉసిరి ఫంగస్ నిరోధకంగా రక్తనాళాలలో కలిగే ఫ్లేక్ నిరోధకంగా, క్యాన్సర్ నిరోధకంగా జీవకణాల్లో డీఎన్‌ఏకు పెంచడం ద్వారా రోగ నిరోధకంగా పనిచేస్తుంది. మనకు లభించే ఆహార పదార్థాలన్నింటిలో అత్యద్భుతమైన యాంటీ యాక్సిడెంట్ గుణాలు పదార్థం కలిగి ఉంటుంది. శరీరంలో నిరంతరం జరిగే జీవ ప్రక్రియతోపాటు కాలుష్యంవల్ల శరీరంలో కణాల మధ్య జరిగే నష్టాన్ని నివారించడంలో చక్కటి పాత్ర పోషిస్తుంది. అనారోగ్యాన్ని కలిగించే కణ విభజనను ఉసిరి నివారిస్తుంది. ఉసిరికాయ నిజానికి అద్భుతమైన ఫలంగానే భావించాలి. పరిగణించే సూపర్ ఫుడ్‌గా పరిగణించే పసుపు కంటే ఉసిరిలో యాంటీ ఆక్సిడెంట్లు రెండు రెట్లు అధికంగా ఉంటాయి. ఉసిరిలో దానిమ్మకాయ కంటే 60 రెట్లు అధికంగా ఉంటాయి. ఉసిరిలో శరీరానికి అత్యంత అవసరమైన విటమిన్ సి కలిగి ఉండి కమజాలాన్ని కలిపి ఉంచే పునరుత్పత్తి చేయడం ద్వారా కీళ్ల నొప్పుల నుంచి, చర్మవ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి. ఇలా ఉసిరికాయలో బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. వీటిని పచ్చళ్ళుగా(ఊరగాయ) తయారు చేసుకుని ఎంచక్కా ఆరగించే అవకాశం ఉంది. కాకుండా వీటిని నిల్వ చేసుకునే అవకాశం కూడా లేకపోలేదు. ఈ ఉసిరి చెట్టును చాలామంది ఇంటి పెరటి భాగంలో పెంపకం చేపడుతారు.

మురుగు కష్టాలు



ఎర్రబల్లె పంచాయతీలో చెత్తాచెదారంతో నిండిన మురుగు కాలువ

పులివెందుల రూరల్ : మండలంలోని ఎర్రబల్లె పంచాయతీలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. గ్రామాల్లో ఇంటి పన్ను వసూలు చేస్తున్నా అందుకు తగిన విధంగా సౌకర్యాలు కల్పించడంలో అధికారుల విఫలమవుతున్నారు. ముఖ్యంగా కాలువలు మరీ దారుణంగా ఉన్నాయి. ఏ కాలువలో చూసినా మురుగునీరు తాండవిస్తోంది. దుర్వాసన వెదజల్లుతుంది. దీనికితోడు కాలువల్లో తాగునీరు కలుషితమవుతోంది. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వాలు నిధులు విడుదల చేస్తున్నా ఆ నిధులు ఎక్కడ ఏ పనులు చేశారో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్య పనులు చేపట్టి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



రక్తదానం చేస్తున్న జూటూరు విజయ్ తదితరులు

కమలాపురం : రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ తేజస్వి తెలిపారు. ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బోగ పార్వతమ్మ బ్లడ్‌బ్యాంక్ సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో రక్త నిల్వలు చాలా తక్కువగా ఉంటాయని, అలాంటి తరుణంలో ఇలాంటి రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. జిల్లా కేంద్రంలో రక్త నిల్వలు లేక చాలా మంది గర్భిణులు అత్యవసర శస్త్ర చికిత్స, ప్రమాద రోగులు, ముఖ్యంగా తలసేమీయా, సికిల్‌సెల్ అనీమియా రోగులకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయన్నారు. యువతీ యువకులు ధైర్యంగా ముందుకు వచ్చి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలన్నారు. ఇలాంటి శిబిరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సీహెచ్‌సీలో మహిళలు సైతం రక్తదానం చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. అనంతరం శిబిరంలో 15 మంది రక్తదానం చేశారు. వారిని నిర్వాహకులు పండ్ల రసాలు అందించారు. అలాగే వారికి ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు జూటూరు విజయ్‌కుమార్, బ్లడ్ బ్యాంక్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

త్యాగధనుడు అమరజీవి పొట్టిశ్రీరాములు



పులివెందులలో పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆమరణ దీక్ష చేసి అశువులు బాసిన గొప్ప త్యాగధనుడు అమరజీవి పొట్టిశ్రీరాములు చరిత్రలో నిలిచారని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతిని పురస్కరించుకుని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ హాల్ గంగాధరరెడ్డి పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. పొట్టిశ్రీరాములు విశిష్టత, దేశభక్తిపై వారు ప్రసంగించారు. తెలుగు రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన పొట్టిశ్రీరాములు మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జిలు పార్నపల్లె కిశోర్, చంద్రమౌళి, కోఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, రంగనాథస్వామి ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు. అలాగే అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి సందర్భంగా ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని పూలంగళ్ల సర్కిల్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుప్త మెడికల్ స్టోర్ వద్ద వాసవి క్లబ్, ఆవోపా సంఘం సంయుక్తంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేసు శ్రీనివాసులు చేతుల మీదుగా ప్రారంభించారు. వాసవి క్లబ్ అధ్యక్షుడు రొట్టెల వినోద్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు మేడా సాయి బాబా, మహిళా మండలి అధ్యక్షురాలు మేడా సుబ్బరత్నమ్మ, ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ సభ్యులు, ఆవోప సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కొరకు ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలర్పించి అమరజీవి అయిన మహాపురుషుడు పొట్టి శ్రీరాములు అని వేంపల్లె అవోపా అధ్యక్షుడు బైరిశెట్టి వెంకట సునీల్‌కుమార్ తెలిపారు. వేంపల్లెలో శ్రీ వాసవికన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆర్యవైశ్య అఫీసియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అవోపా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా పట్టణంలోని ప్రొద్దుటూరు రహదారిలో ఉన్న పొట్టి శ్రీరాముల విగ్రహానికి ఆదివారం గండికోట చారిటబుల్ ట్రస్టు, డీవైఎఫ్‌ఐల ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్యవైశ్య, ఆవోపా సంఘ నాయకులు



వేంపల్లెలో పొట్టిశ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆవోపా సభ్యులు



జమ్మలమడుగులో నివాళులు అర్పిస్తున్న ప్రజా సంఘాల సభ్యులు

నేటి నుంచి పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



బాయ్స్ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బల్లలు

కమలాపురం : పట్టణంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో 521 మంది విద్యార్థులు సోమవారం నుంచి పరీక్షలు రాసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. గురుకుల పాఠశాలలో 167 మంది, జడ్పీ గర్ల్స్ స్కూల్‌లో 75 మంది, జడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో 75 మంది, ప్రగతి-ఏ సెంటర్‌లో 104 మంది, ప్రగతి-బి సెంటర్‌లో 100 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు ఎంఈఓ బేబి తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 నిమిషాల వరకు పరీక్ష నిర్వహిస్తామని అయితే 9 గంటలకే ఓఎంఆర్ షీట్ ఇస్తామని, విద్యార్థులంతా 9 గంటల లోపే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఎంఈఓ తెలిపారు. విద్యార్థులందరికి బల్లలు ఏర్పాటు చేశామని, అలాగే నీరు, కరెంట్, ఫ్యాన్ తదితర సౌకర్యాలన్నీ పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటు చేసినట్లు ఆమె వివరించారు.

144 సెక్షన్ అమలు

పదవ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. పరీక్షా కేంద్రాలకు 500 మీటర్ల దూరం వరకు ఎవరూ ఉండవద్దని ఆయన తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సెంటర్ల వద్ద డ్రాప్ చేసి అక్కడ ఉండకుండా వెళ్లి పోవాలన్నారు. అలాగే పరీక్షా సమయం ముగిసే వరకు పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలన్నారు.

ఎట్టకేలకు ప్రారంభమైన బీటీ రోడ్లు



జరుగుతున్న రోడ్డు పనులు

లింగాల : లింగాల నుంచి తొండూరు మండలం కృష్ణంగారిపల్లె వరకు సుమారు 15.6 కిలో మీటర్లు తారు రోడ్డు నిర్మాణాలను ఆదివారం ప్రారంభించారు. ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద సుమారు రూ.8.42 కోట్లతో 2021 సంవత్సరంలో పనులు ప్రారంభించారు. జూన్ నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉంది. అయితే కొన్ని కారణాల వల్ల పనులు ప్రారంభించలేదు. ప్రస్తుతం నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణాలు నాశికరంగా ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులు ప్రస్తుతం నాశిరకం పనుల వల్ల తిరిగి ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు.

కార్యాలయాన్ని తరలిస్తే ఉద్యమిస్తాం

జమ్మలమడుగు : స్థానికంగా ఏర్పాటు చేసిన అసిస్టెంట్ బీసీ వేల్ఫేర్ కార్యాలయాన్ని ఇక్కడి నుంచి తరలించడం సిగ్గుచేటని ఏఐఎస్‌ఎఫ్ పట్టణ అధ్యక్షుడు అరవింద్, కార్యదర్శి లీలాకృష్ణాలు అన్నారు. ఆదివారం ఓ ప్రైవేట్ కాలేజీలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రస్తుతం ఇక్కడ ఉన్న బీసీ వేల్ఫేర్ కార్యాలయాన్ని ప్రొద్దుటూరుకు తరలించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారన్నారు. వసతి గృహాలపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు.

ఆశాలను ఉద్యోగులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సుభాషిణి

ఎర్రగుంట్ల : ప్రభుత్వాలు ఆశా కార్యకర్తలకు ప్రకటించిన వేతనాల పెంపు, ఉద్యోగుల గుర్తింపు జీఓలను తక్షణం జారీ చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.సుభాషిణీ కోరారు. అదివారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఆశా కార్తకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కేంద్ర వైద్య శాఖ మంత్రి నడ్డా వేతనాల పెంపు, ఉద్యోగులుగా గుర్తింపు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ త్వరలో ఇస్తామని రాజ్యసభలో ప్రకటించారన్నారు. వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వితంతువులకు పెంఛన్‌లు, రేషన్‌కార్డులు, ఇంటి స్థలాలను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, సీపీఐ నాయకులు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌డబ్ల్యూ గురుప్రసాద్‌ను సస్పెండ్ చేయాలి

జమ్మలముగు : జమ్మలమడుగు ఏఎస్‌డబ్ల్యూఓ గురుప్రసాద్‌ను ఉన్నతాధికారులు వెంటనే సస్పెండ్ చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యుడు ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోనీ ఎస్సీ మహిళ వసతి గృహంలో గతంలో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినా వార్డన్‌పై చర్యలు తీసుకోకుండా ఆమెది ఎటువంటితప్పులేదని అది వారి వ్యక్తిగత మంటూ తప్పుడు నివేదికను ఇచ్చారన్నారు. దాని ఫలితంగానే రెండు రోజుల క్రితం అక్షిత అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందన్నారు. గతంలో తప్పుడు నివేదిక ఇవ్వకుండా సరైన నివేదిక ఇచ్చి ఉంటే నేడు ఒక విద్యార్థిని ప్రాణం నిలిచి ఉండేదన్నారు. తప్పుడు నివేదిక ఇచ్చిన గురుప్రసాద్‌ను అధికారులు వెంటనే సస్పెండ్ చేయాలన్నారు.

కార్మికులకు చెప్పిన వాగ్దానాలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మికులు రాధాకృష్ణ

ఎర్రగుంట్ల : ఎన్నికల్లో భవన నిర్మాణ కార్మికులకు చెప్పిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని భవన నిర్మాణ సంఘం నాయకులు రాధకృష్ణ తెలిపారు. అదివారం నిర్వహించిన సమావేశంలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు సంక్షేమ బోర్డు ద్వారా 12 రకాల సంక్షేమ పథకాలు, పనిముట్లు అందిస్తామని కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ కవాత్



సింహాద్రిపురం పురవీధులలో కవాతు నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ సభ్యులు

సింహాద్రిపురం : రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని శత వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా ఆదివారం జున్ను నారాయణరెడ్డి ఆయిల్ మిల్ దగ్గర నుంచి పురవీధుల గుండా వందలాది మందితో ఆర్ఎస్ఎస్ స్వయంసేవకులు కవాతును ఘనంగా నిర్వహించారు. హిందూవులంతా ఏకమై ముందుకు సాగితే ప్రయోజనకరంగా ఉంటుందని ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు అభిప్రాయం వ్యక్తం చేశారు. సంఘ్ కార్యకర్తలు పర్యావరణ పరిరక్షణ, గోరక్షణ, దేవాలయాల రక్షణ, సనాతనమైన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు అంకితభావంతో కృషి చేస్తున్నారన్నారు. హిందూ సమాజమంతా జాగృతమైతేనే భవిష్యత్తు కాలమంతా శుభప్రదంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా అంజుగుట్టు వెంకటనాథరెడ్డి, ప్రధాన వక్తగా పుట్ట శేషు, వంగల శశిభూషణ్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ ముఖ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



నృత్య ప్రదర్శనలో చిన్నారులు

పులివెందుల టౌన్ : స్థానిక శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. పిల్లలు, పెద్దలు ఆటపాటలతో ప్రాంగణమంతా సందడిగా మారింది. కడప కిషోర్ డ్యాన్స్ అకాడమీ డ్యాన్స్ మాస్టర్ కిషోర్ తమ చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. తదితర పాటలకు చిన్నారులు నృత్యం చేసి ఆకట్టుకున్నారు. కార్యక్రమం ఏర్పాట్లను శిల్పారామం ఏఓ సుధాకర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఫీల్డ్ సూపర్‌వైజర్ ఇస్మాయిల్, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

కడప రూరల్: ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు పీవీ.రమణ అన్నారు. నేతలు కోరారు. స్థానిక గిరిజన భవన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి డాక్టర్ రామక్రిష్ణ, జిల్లా గౌరవాధ్యక్షుడు సుంకన్న, బాబూ నాయక్, డాక్టర్ వెంకట్ పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మతల్లి వార్షికోత్సవం



గంగమ్మతల్లికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మండలంలోని చిర్రాజుపల్లిలో వెలసిన గంగమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం అదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సుధీర్‌రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయల కమిటీ నిర్వాహుకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ఆల్ ది బెస్ట్

పులివెందుల టౌన్ : సోమవారం నుంచి 10వ తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులందరికి ఆల్ ది బెస్ట్ అని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన తెలియజేస్తూ పదవ తరగతి ఫలితాలే జీవితంలో ఉన్నత చదువుకు తొలి మెట్టు అన్నారు. విద్యార్థులందరూ పరీక్ష హాలుకు ముందుగానే చేరుకుని పరీక్షలు బాగా రాయాలన్నారు. తల్లిదండ్రుల కష్టాలను, ఉపాధ్యాయుల శ్రమను, మీ భవిష్యత్తును గుర్తు చేసుకుని ఎలాగైతే పరీక్షలకు సన్నధమయ్యారో అదేవిధంగా పరీక్షలు ఎలాంటి ఒడిదుడుకులకు, ఒత్తిళ్లకు లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఆకాంక్షించారు.

మత్తులో చిత్తు

పులివెందుల రూరల్ : పట్టణంలో ఉదయం 6 గంటలకే మద్యం లభిస్తుండటంతో మద్యం బాబులు తాగి ఎక్కడ పడితే అక్కడ రోడ్లపై మత్తుగా పడిపోతున్నారు. మద్యం బాబులు తెల్లవారుజామునే మద్యం సేవిస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉదయం 11 గంటల వరకు షాపులు తెరిచేవారు కాదు. దీంతో మద్యం కూడా లభించేది కాదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మద్యం ఇష్టం వచ్చిన సమయంలో మందుబాబులకు అందుబాటులో ఉంది. దీంతో మందు బాబులు ఫుల్‌గా తాగి మత్తులో రోడ్లపైన పడి పోతున్నారు. మందు కూడా కల్తీ మందు వస్తుండటంతో క్వాటర్ బాటిల్ తాగితేనే కైపు ఎక్కి ఎక్కడ పడితే అక్కడ పడిపోతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 10 గంటలకు మద్యం షాపులు తెరిచేలా చర్యలు తీసుకోవాలని మందుబాబుల కుటుంబ సభ్యులు, ప్రజలు కోరుతున్నారు.



పాతబస్టాండ్ సమీపంలో మందు ఎక్కువై పడి పోయిన మందుబాబు



పార్నపల్లె బస్టాండ్‌లో ఇలా..